# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 16-01-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **జాతీయ స్టార్టప్ డే సందర్భంగా స్టార్టప్ రంగానికి శుభాకాంక్షలు తెలిపిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.**

2. **జగ్గన్నతోట ప్రభల తీర్థానికి రాష్ట్ర పండుగ హోదా కల్పిస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**

3. **కాకినాడ జిల్లాలో రేపు పర్యటించనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కే.పవన్ కల్యాణ్.**

4. **2026 ఐసిసి పురుషుల అండర్-19 ప్రపంచ కప్ క్రికెట్ మొదటి మ్యాచ్‌లో విజయం సాధించిన భారత్.**

===========================

జాతీయ స్టార్టప్ డే సందర్భంగా స్టార్టప్ రంగానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. స్టార్టప్ ఇండియా ప్రారంభించి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్టార్టప్ డేని దేశం గర్వంగా జరుపుకుంటోందని చెప్పారు. భారత స్టార్టప్ వ్యవస్థ ప్రపంచ స్థాయిలో ఎదగడంలో యువత ధైర్యం, ఆవిష్కరణలపై చూపిన ఆసక్తి, వ్యాపార స్ఫూర్తి కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. దేశ అభివృద్ధిలో స్టార్టప్‌లు మూల స్థంభాలుగా మారాయని ప్రధానమంత్రి మోదీ వివరించారు. 'స్టార్టప్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఈ మధ్యాహ్నం నిర్వహించే కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొంటారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన అంకుర సంస్థల ప్రతినిధులతో ప్రధాన మంత్రి ముచ్చటించనున్నారు. అనంతరం సభికులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు.

--------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కే.పవన్ కల్యాణ్ రేపు కాకినాడ పర్యటిస్తారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా ఎస్పీ బింధు మాధవ్, ముఖ్యమంత్రి భద్రతా దళాధికారులతో కలిసి కార్యక్రమ స్థలాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్ల గురించి నిన్న చర్చించారు. కాకినాడ గ్రామీణ ప్రాంతంలో నిర్మించిన ఏఎం గ్రీన్ అమ్మోనియా(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారు. అనంతరం జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యక్రమం శాంతియుతంగా, సురక్షితంగా, సమర్థంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

---------------------------

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జాతీయ స్థాయి ప్రసిద్ధి గాంచిన జగ్గన్నతోట ప్రభల తీర్థానికి 476 ఏళ్ల చరిత్ర ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఎంతో ప్రశస్తమైన ఈ ప్రభల తీర్థానికి రాష్ట్ర పండుగ హోదా కల్పించినట్లు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ ఏడాది జరిగే ప్రభల తీర్థానికి దాదాపు ఐదు లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వ అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ప్రభల తీర్థ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

---------------------------

విజయవాడ పశ్చిమ నియోజకవర్గం విద్యాధరపురంలో శ్మశాన వాటిక, షాదీ ఖానా ఆధునీకరణతో పాటు ఇతర మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. విజయవాడ పరిధిలోని విద్యాధరపురంలో ఉన్న షాదీ ఖానా, ఈద్గా ప్రాంగణాన్ని ఆయన ఈరోజు పరిశీలించారు. వక్ఫ్ బోర్డు, పార్లమెంట్ సభ్యుల నిధుల నుంచి అభివృద్ధి పనులకు కేటాయించనున్నట్లు కేశినేని శివనాథ్ తెలియజేస్తూ..

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రైతులను ఉద్దేశించి ప్రకృతి వ్యవసాయం గురించి మాట్లాడడంపై నంద్యాల జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రకృతి వ్యవసాయంలో వచ్చే దిగుబడులు వాటి ప్రయోజనాలు మోదీ తెలపడం శుభ పరిణామమని, ప్రధానమంత్రి సూచనలు సలహాలు తప్పకుండా పాటిస్తామని నంద్యాలకు చెందిన రైతు వీరం ప్రసాద్ రెడ్డి పేర్కొంటూ..

వాయిస్...27 సెకన్లు

---------------------------

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో రానున్న మహా శివరాత్రి వేడుకలు నిర్వహించేందుకు పూర్తి కార్యాచరణ రూపొందించినట్లు శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి దేవస్థానంలో దేశ పర్యటన చేసే ధర్మ ప్రచార రథాన్ని, నూతనంగా ఏర్పాటు చేసిన రాహు కేతు పూజ టికెట్ కౌంటర్లను శాసనసభ్యులు ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్ లైన్ విధానంలో కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

---------------------------

2026 ఐసిసి పురుషుల అండర్-19 ప్రపంచ కప్ క్రికెట్‌లో భారత్ మొదటి విజయ నమోదు చేసింది. జింబాబ్వేలోని బులవాయోలోని క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్‌లో నిన్న జరిగిన మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో అమెరికాను ఓడించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన అమెరికా 35.2 ఓవర్లలో 107 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ వర్షం కారణంగా మ్యాచ్ ను 37 ఓవర్లకు తగ్గించారు. దీంతో 96 పరుగుల

లక్ష్యాన్ని 17.2 ఓవర్లలో భారత్ ఛేదించింది. బంగ్లాదేశ్‌తో రేపు అదే వేదికలో రెండో మ్యాచ్ భారత ఆడనుంది.

---------------------------

పశ్చిమ గోదావరి జిల్లా, నరసాపురం పట్టణంలోని రుస్తుంబాద క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన 31 వ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు అత్యంత ఉత్సాహంగా సాగుతున్నాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన జట్లు ఈ టోర్నీలో తలపడుతుండటంతో కబడ్డీ అభిమానులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఆంధ్రా, తమిళనాడు జట్ల మధ్య నిన్న మ్యాచ్‌లు జరిగాయి. ఈ పోటీలను వీక్షించేందుకు నరసాపురం పట్టణ ప్రజలే కాకుండా చుట్టుపక్కల మండలాల నుండి పెద్ద ఎత్తున క్రీడాభిమానులు హాజరవుతున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు రోజులు పొడి వాతావరణం నెలకొనే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి బి. శేఖర్ తెలియజేశారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 130వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 23వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

రచయిత, సంఘసంస్కర్త,స్వాతంత్ర్య సమరయోధులు కవిరాజుగా ప్రసిద్ధి చెందిన త్రిపురనేని రామస్వామి వర్ధంతి ఈరోజు. ఆయన 1887 జనవరి 15వ తేదీన కృష్ణా జిల్లా, అంగలూరు గ్రామంలో జన్మించారు. 1914లో న్యాయ శాస్త్రం చదివేందుకు డబ్లిన్ వెళ్లిన ఆయన అనీ బీసెంట్ ప్రారంభించిన హోం రూల్ ఉద్యమానికి మద్దతు ఇచ్చి, స్వాంతంత్ర్యోద్యము రోజులలో ప్రజలకు స్ఫూర్తినిచ్చి ఉత్తేజపరిచే అనేక దేశభక్తి గీతాలు రచించారు. ఆంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడిన త్రిపురనేని రామస్వామి 1943 జనవరి 16వ తేదీన తుదిశ్వాస విడిచారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుపతిలో ఉన్న టీటీడీ పరిపాలన భవనం ప్రాంగణంలో కన్నుల పండువగా గోదా కళ్యాణాన్ని నిన్న రాత్రి నిర్వహించారు. ఈ కళ్యాణాన్ని భక్తులు భక్తి పారవశ్యంతో వీక్షించారు. శ్రీకృష్ణస్వామి, ఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించిన తిరుమల శ్రీవారి ఆలయ అర్చకులు శ్రీవిష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణం, రక్షాబంధనం అగ్నిప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. సర్కారు సంకల్పం, మధుపర్క నివేదనం, వస్త్ర సమర్పణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు.

=====================